## ఉద్యోగపర్వ కథాంశాలు

మహాభారతము పద్దెనిమిది పర్వములలో ఉద్యోగ పర్వము అయిదవది. ఇందు పది ఉప పర్వములు 6682 శ్లోకములు గలవు.

### 1) సేనోద్యోగ పర్వము:-

ఈ ఉప పర్వమున 19 అధ్యాయములు గలవు. విరాటపుత్రియగు ఉత్తరతో అభిమన్యుని వివాహము జరుగగా పాండవులందరు సంతోషించిరి. నాల్గవ రోజున పాండవులు విరాటుని సభలో కొలువు దీరిరి. సభలో మొట్టమొదటగా వృద్ధుడగు విరాటరాజు, ద్రుపదుడు ఆసనముల నలంకరించిరి. పిమ్మట తండ్రి వసుదేవునితో కూడా శ్రీ కృష్ణబలరాములు ఆసనములను గ్రహించిరి. విరాట, ద్రుపద, ద్రౌపదీపుత్రులు, ఇతర మహారథులు కూడా సభయందుండిరి. వారందరు శ్రీకృష్ణుని సారగర్భిత వచనములను వినవలెనని కుతూహలముతోనుండిరి. సభలో సుబలపుత్రుడగు శకుని మాయాద్యూతమున ధర్మరాజును ఓడించి రాజ్యము నెట్టులపహరించెనో శ్రీ కృష్ణభగవానుడు ప్రస్తావించెను. ద్యూతమున ఓడినవారు పండ్రెండు సంవత్సరములు వనవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయవలెనని షరతు పెట్టబడినది. దాని ప్రకారము ద్యూత క్రీడయందు ఓడిన పాండవులు పండ్రెండు సంవత్సరములు వనవాసము చేసి పిమ్మట మారువేషమున విరాటుని కొలువులో ఎన్నో కష్టములను సహించి ఒక సంవత్సరము అజ్ఞాత వాసమును పూర్తి చేసిరి. కౌరవుల మోసమువలన పాండవులు అనవసరంగా ఎన్నో క్లేశముల ననుభవించిరి. వనవాస అజ్ఞాతవాసములను పూర్తిచేసి పాండవులు తమ సంపత్తిని అడుగుచున్నారు. సత్యనిష్ఠుడగు యుధిష్ఠిరుడు సోదరులతో కూడా ఇక్కడనే ఉన్నాడు. కౌరవులు విపరీతముగ వ్యవహరించినచో పాండవులు తప్పక వారిని వధించగలరు. దుర్యోధనుని అభిమతమేమో ఇంతవరకు మనకు తెలియదు. కనుక ఎవరైన ధర్మశీలుడు దూతగా దుర్యోధనుని వద్దకు వెళ్ళి యుధిష్ఠిరునికి సగం రాజ్యం ఇమ్మని హితోపదేశము చేయవలెనని వక్కాణించెను. బలరాముడు శ్రీ కృష్ణుని మాటలను ప్రశంసిస్తూ ఇట్లుపలికెను. సత్యశీలుడగు యుధిష్ఠిరుడు తనరాజ్యమును విడిచి కేవలము సగం రాజ్యమునే కోరుచున్నాడు. పాండవులకు సగంరాజ్యం ఇచ్చుటవలన

కౌరవులకు శాంతి లభించును. ప్రజలకు హితము కల్గును. కనుక కౌరవ పాండవుల మధ్య శాంతి స్థాపనకు దూతను పంపుట మంచిది. యుధిష్ఠిరునకు ప్రయోజనము నెరవేరుటకు దూత కౌరవుల వద్దకు వెళ్ళి వారితో శాంతి పూర్వకముగ వ్యవహరించవలెను. ఎట్టి పరిస్థితులలోను వారిని ఉద్రేకపరచుటగాని, కోపగించునట్లు చేయుట గాని తగదు. స్నేహితులందరు నివారించినను యుధిష్ఠిరుడు ద్యూత క్రీడను మానలేదు. ద్యూతమందు ఆసక్తుడై రాజ్యమును పోగొట్టుకొనెను. ఇతర ఆటగాళ్ళు ఉన్నా అతడు శకునిని రెచ్చగొట్టి అతనితో ద్యూతమాడి ఓడిపోయాడు. ఈవిధంగా బరాముడు చెబుతూ ఉండగా అంతలో సాత్యకి ఒక్కసారిగా లేచి నిలబడి బలరాముని సంభాషణను అడ్డుకొని కోపంతో ఇట్లులనెను. ఏవ్యక్తి అయినను అంతఃకరణము ననుసరించి మాట్లాడును. బలరాముడు కూడా అదే చేసెను. వనవాసము పూర్తిచేసి పాండవులు తమ సంపదకు అధికారులైరి. శత్రువులను యాచించుట అధర్మము, అపకీర్తికి మూలము. యుధిష్ఠిరునకు తప్పక రాజ్యము లభించవలెను. లేనిచో కౌరవులందరు యుద్ధమున చావక తప్పదు. ద్రుపదుడు సాత్యకి వచనములను సమర్ధించుచు బలరాముడు చెప్పినది నాకు కూడా రుచించుటలేదు. కౌరవుల వద్దకు తొందరగా దూతను పంపవలెను. నా వద్ద పురోహితులు విద్వాంసులు గలరు. వారిని దౌత్యమునకు పంపుట ఉచితమని చెప్పగా శ్రీ కృష్ణుడు తనసమ్మతిని తెలియజేసి ద్వారకకు వెడలెను. పిమ్మట పాంచాలరాజు యుధిష్ఠిరుని సమ్మతిని తీసుకొని తన పురోహితుని పుష్యనక్షత్రయుక్త జయనామక ముహూర్తమున కౌరవులవద్దకు దూతగా పంపుటకు నిశ్చయించెను. ద్రుపదుని ఆదేశానుసారము సదాచారసంపన్నుడగు పురోహితుడు హస్తినాపురమునకు బయలుదేరెను.

ద్రుపద పురోహితుని హస్తినకు పంపి పాండవులు ఇతర రాజుల వద్దకు కూడా తమదూతలను పంపు ఏర్పాటు గావించిరి. అన్ని ప్రదేశములకు దూతలను పంపి అర్జునుడు స్వయంగా ద్వారకాపురికి బయలుదేరెను. దుర్యోధనుడు గూఢచారుల ద్వారా పాండవుల వ్యవహారమంతయు తెలుసుకొనెను. అర్జునుడు ద్వారకకు బయలుదేరిన రోజుననే దుర్యోధనుడు కూడా ద్వారకకు వెడలెను. శ్రీ కృష్ణుడు నిద్రపోయిన సమయమున వారిద్దరు అక్కడికి వెళ్ళిరి. మొదట దుర్యోధనుడు సభాభవనమున ప్రవేశించి శ్రీ కృష్ణుని శిరస్సువైపు ఉన్న

ఆసనముపై కూర్చుండెను. పిమ్మట అర్జునుడు శ్రీ కృష్ణుని శయనాగారమును ప్రవేశించి ఎంతో విధేయతతో చేతులు జోడించి భగవంతుని పాదములవద్ద కూర్చొనెను. మెలకువ రాగానే శ్రీ కృష్ణుడు మొదటగా అర్జునుని చూచెను. వారిద్దరిని శ్రీ కృష్ణుడు యథోచితముగ సత్కరించి వారి రాకకు కారణమడిగెను. అప్పుడు దుర్యోధనుడు యుద్ధమున శ్రీ కృష్ణుని సహాయముకోరెను.
దుర్యోధనుడు ముందు వచ్చినను నేను నిద్రనుండి లేచి ముందుగా అర్జునుని చూచితిని. కనుక ఇద్దరికి సహాయము చేయుటకు నేను సిద్ధంగా ఉన్నాను. కాని శ్రుతివచనము ప్రకారము చిన్నవయస్సుకల అర్జునుడు మొదటగా అభీష్టవస్తువును పొందుటకు అర్హుడు. నా వద్ద పదికోట్ల (అర్బుదము) విశాల సైన్యముగలదు. యుద్ధము చేయుటకు వారు ఎల్లప్పుడు సిద్ధమే. రెండవవైపున నేను ఒంటరిగా నుందును. నేను యుద్ధము చేయను ఆయుధములను పట్టను. అర్జునా! ఈ రెండిటిలో ఏదో ఒకటి కోరుకొనుమని పలుకగా అర్జునుడు శ్రీ కృష్ణుని కోరుకొనెను. దుర్యోధనుడు తనలోతాను ఎంతో సంతోషించి విశాల సైన్యమును కోరుకొనెను. మిక్కిలి సంతోషంతో దుర్యోధనుడు బలరాముని వద్దకు వెళ్ళి తన రాకకు కారణము నివేదించెను. బలరాముడు అతనితో నేను అర్జునునికి గాని నీకు గాని సహాయము చేయను. క్షత్రియధర్మమునసుసరించి యుద్ధము చేయుమని ఉపదేశించెను. బలరాముని మాటలకు మనస్సులో సంతోషించిన దుర్యోధనుడు తన విజయము నిశ్చయమని తలచెను. పిమ్మట దుర్యోధనుడు కృతవర్మవద్దకు వెళ్ళగా అతడతనికి ఒక అక్షౌహిణి సేననిచ్చెను. తన అదృష్టమునకు మురిసి పోవుచు దుర్యోధనుడు హస్తినాపురమునకు తిరిగి వచ్చెను. అర్జునుని ప్రార్థననాలకించి రథసారథి యగుటకు శ్రీ కృష్ణుడంగీకరించెను.

దూత ద్వారా పాండవ సందేశమును విని శల్యుడు తనపుత్రులు, విశాలసైన్యముతో యుధిష్ఠిరుని కలియుటకు బయలుదేరెను. అది తెలుసుకొని దుర్యోధనుడు మార్గమధ్యమున శల్యుని స్వాగత సత్కారములకు పెద్ద ఏర్పాటు గావించెను. శల్యుడు అతని ఆతిథ్యమునకు సంతోషించి దుర్యోధనుని వరముకోరుకొమ్మని అడిగెను. తన సంపూర్ణసైన్యమునకు అధినాయకత్వము వహించమని శల్యుని ప్రార్థించెను. సంతోషముగ అతడు దుర్యోధనుని కోర్కెను మన్నించెను.

పిమ్మట శల్యుడు యుధిష్ఠిరుని కలసి దుర్యోధనునికిచ్చిన వరమును ప్రస్తావించెను. యుధిష్ఠిరుడు అతనితో మహారాజా! రథసారథ్యమున శ్రీ కృష్ణునికి సాటి మీరే. నాకు మీరు హితము చేయవలెనని సంకల్పించిన యుద్ధమున అర్జునుని రక్షింపుడు. యుద్ధరంగమున కర్ణ అర్జునులు ఎదురుపడిన మీరు కర్ణుని నిరుత్సాహ పరచవలెనని కోరెను. మీమనోరథమును తప్పక తీర్చెదనని చెబుతూ శల్యుడు ఇంతకు మించి ఏదైనా అవసరమైనచో తప్పక చేయగలను. విధిబలవత్తరమగుటచే మహాపురుషులు కూడా  అప్పుడప్పుడు కష్టముల పాలగుదురని పలికి ఇంద్రుడు కష్టములననుభవించిన వృత్తాంతమును వినిపించి ధర్మరాజు వద్ద సెలవుతీసుకొని

మద్రరాజగు శల్యుడు తన సేనతో దుర్యోధనుని వద్దకు వెడలెను. దుర్యోధనునికి అనుకూలురగు రాజులందరు యథావకాశము తమ సేనలను అతని వద్దకు పంపిరి. అంతయుకలిపి దుర్యోధనుని వద్ద పదకొండు అక్షౌహిణి సేనలు ప్రోగుపడెను.

**2) సంజయయాన పర్వము:-**

ఈ పర్వమున పదమూడు అధ్యాయములు గలవు. ద్రుపద పురోహితుడు దూతగా కౌరవుల వద్దకు వచ్చి ధృతరాష్ట్ర భీష్మ విదురాదులచే గౌరవింపబడి సభలో పాండవుల సామర్థ్యమును వర్ణిస్తూ మీరు ధర్మానుసారముగ పాండవులకు లభించవలసిన రాజ్యం వాళ్ళకు ఈయవలసినదని విన్నవించెను. అతని మాటలను సమర్థిస్తూ భీష్ముడు అర్జునుని పరాక్రమమును వర్ణించసాగెను. మధ్యలో కర్ణుడు కలగజేసుకొని భీష్ముని అవహేలన చేస్తూ దుర్యోధనుడు సగంరాజ్యమే కాదు, నాల్గవవంతు కూడా ఈయడు. భీష్ముడు మూర్ఖత్వంచే తనబుద్ధిని అధార్మికంగా చేసుకొనుచున్నాడని పలికెను. కర్ణుని మాటలను తిరస్కరిస్తూ భీష్ముడు తిరిగి అర్జునుని పరాక్రమమును, విరాటనగర యుద్ధమున అర్జునుని చేతిలో ఆర్గురు మహారథులు పరాజయము పొందుటను ప్రస్తావించెను. తదనంతరము ధృతరాష్ట్రుడు కర్ణుని హెచ్చరించి భీష్ముని సమ్మానించెను. భీష్ముని ఉపదేశము అందరికి మేలు కల్గించునదని అతడు చెప్పెను. ధృతరాష్ట్రుడు పురోహితుని సత్కరించి పంపివేసి పాండవుల వద్దకు సంజయుని రాయబారమునకు పంపుటకు

నిశ్చయించెను. ధృతరాష్ట్రుని ఆదేశమునసుసరించి సంజయుడు పాండవుల యోగక్షేమములను తెలుసుకొనుటకు కౌరవ పాండవుల మధ్య అనుకూలవ్యవహారమును నెరపుటకు ఉపప్లవ్య నగరమునకు వెడలెను. యుధిష్ఠిరుని కలిసి సంజయుడు కుశల ప్రశ్నలు అడిగెను. పిమ్మట యుధిష్ఠిరుడు సంజయుని కౌరవుల వ్యవహారమును గూర్చి అడిగెను. అడిగిన ప్రశ్నలకు సమాధానము చెప్పిన పిమ్మట సంజయుడు ధృతరాష్ట్రుని సందేశమును వినిపించెను. ఆసమయమున అచ్చట శ్రీ కృష్ణ, సాత్యకి, విరాటులు, పాండవులందరు ఉండిరి. ధృతరాష్ట్రుడు శాంతిని మాత్రము కోరుచున్నాడు. వారి శాంతి సందేశము మీకు ఇష్టమైనచో ఇరు పక్షముల మధ్య సంధి కుదుర్చుకోవచ్చునని సంజయుడు చెప్పగా యుధిష్ఠిరుడు సంజయ! యుద్ధ ప్రస్తావనమును మేము ఎప్పుడూ తీసుకురాలేదు. నీవు ఎందుకు భయపడుచుంటివి. ధృతరాష్ట్రుడు, వారి పుత్రులు అధర్మ మార్గము నాశ్రయించుచున్నారు. మా విషయమున కౌరవుల దుర్వ్యవహారము దాగేది కాదు.

ఇంద్రప్రస్థమున నారాజ్యమును నాకు దుర్యోధనుడు తిరిగి ఈయవలెనని పలికెను. యుద్ధము వలన కలుగు అనర్థములను పేర్కొని సంజయుడు రాజా! మీరు మీమంత్రులకోరిక ననుసరించి యుద్ధము చేయవలెనని కోరినచో మీ సర్వస్వము వారికే ఇచ్చి వేయండి. అంతేగాని కుటుంబమును నాశముగావించి ధర్మభ్రష్టులుగావద్దని ఉపదేశించెను. అతని ఉపదేశములను విని ధర్మరాజు సంజయా! పాండవులు ధర్మమార్గము ననుసరించుచున్నారా? లేక అధర్మమార్గమునా?యని మొదటగా తెలుసుకొనుడు. ధర్మ ప్రభువు, కుశలనీతవేత్తయగు శ్రీకృష్ణభగవానుడు ఇరుపక్షముల హితవును కోరుచున్నారు. వారు తమ అభిప్రాయమును వెల్లడించెదరని చెప్పెను.

శ్రీ కృష్ణుడు నేను రెండు పక్షముల మంచినే కోరుకొనుచున్నాను. పాండవులు కౌరవులతో సంధి చేసుకొని శాంతిపూర్వకముగ నుండ వచ్చును. కాని పైతృక సంపత్తిని పాండవులకు తిరిగి అప్పజెప్పకుండా ఇది సాధ్యముకాదు. ధర్మపరాయణులగు పాండవులు శాంతికైనా, యుద్ధముకైనా సిద్ధంగా ఉన్నారు. బాగుగా ఆలోచించి ధృతరాష్ట్రునికి యథార్థమును నివేదించవలసినది అని పలికెను. సంజయుడు హస్తినాపురమునకు బయలుదేరుటకు వారినుండి అనుమతికోరెను.

యుధిష్ఠిరుడు సంజయా! నీవు అక్కడకు వెళ్ళి పాండవులక్షేమ సమాచారమును చెప్పవలసినది. పాండవులు శాంతికైనా, యుద్ధమునకైనా సిద్ధమేనని నాసందేశమును వినిపించవలసినదని పేర్కొనెను. పాండవుల సందేశమును తీసుకొని సంజయుడు ధృతరాష్ట్రుని కలసి వారి క్షేమసమాచారమును తెలియజేసి అతనితో మహారాజా! సమస్త ప్రపంచమున మీరొక్కరే పుత్రవ్యామోహంలో పడి ద్యూతక్రీడను సమర్థించితిరి. దాని పరిణామమును గమనింపుడు. అవిశ్వసనీయులను చేరదీసి విశ్వసింపదగినవారిని శిక్షించితిరి. రాజా! నేను బాగా అలసిపోతిని. ఉదయము కౌరవసభ యందు ధర్మరాజు పంపిన సందేశమును వినిపించెదనని చెప్పి అనుమతిని పొంది ఇంటికేగెను.

**3) ప్రజాగర పర్వము:-**

ఈ ఉపపర్వమున ఎనిమిది అధ్యాయములు గలవు. సంజయుడు వెళ్ళిన తరువాత ధృతరాష్ట్రుడు విదురుని పిలిపించెను. మహారాజు ఆజ్ఞానుసారము విదురుడు అతనిని కలిసెను. ధృతరాష్ట్రుడు అతనితో సంజయుడు వచ్చిన విషయమును ప్రస్తావన చేసి పాండవులను కలిసి వచ్చిన సంజయుడు నన్ను నిందించి వెళ్ళినాడు. ధర్మరాజు పంపిన సందేశమును రేపు సభలో వినిపించగలడు. యుధిష్ఠిరుని మనస్సులోని మాట
తెలియక పోవుటచే నా హృదయము దహించుకుపోవుచున్నది. విచారంతో నిద్రపట్టుటలేదు. శాంతి లభించుటలేదు. మంగళము కల్గించు మాటలను చెప్పవలసినదని విదురుని వేడెను. అంతట విదురుడు మహారాజా! బలవంతుని విరోధించు దుర్బలునికి, సర్వస్వమును పోగొట్టుకున్నవానికి, కాముకునికి, దొంగకు నిద్రరాదు. ఈ చెప్పిన వానిలో ఏదేని దోషము మీ వద్దనున్నదా? అని ప్రశ్నించెను. తిరిగి ధృతరాష్ట్రుడు కళ్యాణకారకములగు మాటలను వినిపించమని కోరెను. విదురుడు పండితులు, మూర్ఖుల లక్షణములను పేర్కొని సత్య ధర్మమార్గముల గొప్పతనమును తేలియజేసి చివరగా పాండురాజు కొడుకులు అయిదుగురు ఇంద్రుల వలె శక్తి సంపన్నులు. కనుక రాజా! పాండవులకు రావలసిన రాజ్యమును వారికిచ్చి సుఖ సంతోషములతో నుండుమని ఉపదేశించెను. ధృతరాష్ట్రుడు మరల విదురుని కర్తవ్యోపదేశము చేయమని

కోరగా విదురుడు ధర్మమార్గమును ఉపదేశించెను. వీటి వలన నా కెట్టి తృప్తిలభించుట లేదని పలుకగా విదురుడు కౌరవ పాండవులిద్దరితో సమానముగ వ్యవహరించమని ధృతరాష్ట్రునికి హితవుపలికెను. ఈ సందర్భమున అతడు స్వయంవరమున కేశిని యనుసౌందర్యవతియగు కన్యను బొందుటకు సుధన్వ విరోచనుల పరస్పరసంవాదమును వినిపించెను. దుర్యోధన, శకుని, దుశ్శాసన, కర్ణులపై రాజ్యభారముంచి మీరు ఎట్లు అభివృద్ధిని ఆశించగలరు? పాండవులకు మీ మీద పితృభక్తి కలదు. కనుక మీరు కూడా పాండవులను పుత్రభావముతో చూడవలసినదని చెప్పెను. పిమ్మట ధృతరాష్ట్రుడు అతనితో విదురా! నా పుత్రులు యుధిష్ఠిరునితో దుర్వ్యవహారము చేసిరి. కనుక పాండవులు యుద్ధమున నాకొడుకులను తప్పక చంపుతారనే భయంతో నామనస్సు ఉద్వేగమునకు లోనగుచున్నది. కనుక మనశ్శాంతికి మార్గమును ఉపదేశింపుమని కోరెను. పాండవులతో సంధి చేసుకొని చెడు మార్గమునుండి మంచి మార్గమున ప్రవేశించవలసినదని చెప్పగా అది విని ధృతరాష్ట్రుడు నా ఆలోచన కూడా అదియే పాండవుల యెడ నాకు మంచిభావనగలదు. కాని దుర్యోధనుడు కనబడగానే నాబుద్ధిమారి పోవుచున్నది. ప్రారబ్ధమును ఎవ్వరూ తప్పించలేరు. నేను కూడా ప్రారబ్ధమును అంగీకరించెదను. దీని ముందు పురుష ప్రయత్నము వ్యర్థమని పలికెను.

**4) సనత్సుజాత పర్వము:-**

ఇందు ఆరు అధ్యాయములు గలవు. ధృతరాష్ట్రుడు విదురునితో చెప్పవలసినది
ఏదైనా మిగిలి యుంటే వినిపించవలసినదని కోరెను. మహారాజా! మీ ప్రశ్నలన్నిటికి సమాధానము చెప్పుటకు బ్రహ్మ పుత్రుడగు సనత్సుజాతుడు సమర్థుడని చెప్పి విదురుడు మహర్షిని స్మరించెను. వెను వెంటనే ప్రత్యక్షమైన ఋషికి అతిథిమర్యాదలు గావించి విశ్రాంతి తీసుకొను సమయమున ధృతరాష్ట్రుని సంశయములను నివృత్తి చేయవలెనని విదురుడు ప్రార్థించెను. ధృతరాష్ట్రుడు మహర్షీ! మృత్యువు లేదనేది మీ సిద్ధాంతము. కాని మృత్యువు నుండి రక్షించుకొనుటకు దేవదానవులు బ్రహ్మచర్యమును పాటించిరని నేను వింటిని. ఈ రెండిటిలో యథార్థమేమని ప్రశ్నించెను. దీనికి సమాధానముగ మహర్షి ఇట్లు

చెప్పెను. రెండు పక్షములు యథార్థములే. వానిలో ప్రమాదము మృత్యువు. అప్రమాదము అమృతము. ప్రమాదముకారణముగా రాక్షసులు పరాజయమునొందిరి. అప్రమాదముచే దేవగణము బ్రహ్మస్వరూపమును పొందిరి. మృత్యువునకు ఎటువంటి రూపము లేదు. కర్మ ఫలమందు ఆసక్తులగు మనుష్యులు దానిననుభవించుటకు దేహత్యాగము చేసి తిరిగి దేహమును ధరించుచున్నారు. మృత్యువును వారు జయించలేరు. ఈ విధముగ ధృతరాష్ట్రుడు అడిగిన అనేక ప్రశ్నలకు సనత్సుజాతుడు సమాధానము చెప్పెను. దీనినే సనత్సుజాతీయమందురు.

**5) యానసంధి పర్వము:-**

ఈ ఉపపర్వమున 25 అధ్యాయములు గలవు. సంజయుని వలన పాండవుల సందేశమును వినవలె నను ఉత్సాహంతో మరుసటిరోజు రాజులందరు సభకు వచ్చిరి. దుర్యోధన దుశ్శాసనాదులు కూడా సభయందుండిరి. ధృతరాష్ట్రుడు అడుగగా సంజయుడు ముందుగా అర్జునుని సందేశమును వినిపించెను. దుర్యోధనుడు ఒకవేళ యుధిష్ఠిరునకు రాజ్యమీయక పోయినచో ధృతరాష్ట్ర పుత్రులు దానికి తగిన ఫలితము ననుభవించవలసియుండును. భీమసేనుడు, అర్జునుడు మున్నగు మహా వీరులతో వారు యుద్ధము చేయవలసియుండును. అప్పుడు దుర్యోధనుడు జరిగినదానికి చింతిస్తూ పశ్చాత్తాపపడును. శ్రీ కృష్ణ భగవానుడు మా పక్షమునను్నాడు. శ్రీ కృష్ణుడు యుద్ధము చేయక పోయినను మనస్సులో ఎవరి విజయమునాకాక్షించునో వారు తప్పక విజయమునొందుదురు. నేను కర్ణునితో సహా ధృతరాష్ట్రపుత్రుల నందరిని చంపి కురురాజ్యమును జయించెదను. ధృతరాష్ట్రపుత్రులలో ఎవ్వరిని విడిచిపెట్టను. అయినప్పటి భీష్మ, కృపాచార్య, ద్రోణ, అశ్వత్థామ, విదురులు అందరు కలసి ఏమి చెప్పెదరో అట్టే జరుగును. కౌరవులందరు దీర్ఘాయుర్ధయముకలవారై యుండుగాకయని
అర్జునుని సందేశము.

భీష్ముడు దుర్యోధనునితో కృష్ణార్జునులు నరనారాయణుల అవతారములు. లోకహితము కొఱకు ఎచ్చటెచ్చట యుద్ధము అవసరమేర్పడునో అచ్చటచ్చట నరనారాయణులు అవతరించెదరు. దుర్యోధనా! నామాట వినక పోయినచో కౌరవనాశము తప్పక జరుగును

నీవు సూతపుత్రుడు కర్ణుడు, శకుని, దుశ్శాసనుల అభిప్రాయములను ఆమోదించుచున్నావని పలికెను. కర్ణుడు భీష్ముని అధిక్షేపిస్తూ నేను ఎన్నడూ దుర్యోధనునికి అనిష్టమాచరించలేదు. పాండవులతో సంధి చేసుకొనుట ఉచితముకాదు. నేనొక్కడినే పాండవులను చంపుటలో సమర్థుడనని పలికెను. కర్ణుని అహంకారపూరిత వచనములను భీష్ముడు అధిక్షేపించెను. ద్రోణాచార్యుడు భీష్ముని వచనములను సమర్థిస్తూ పాండవులతో సంధి చేసుకొమ్మని సలహాయిచ్చెను. భీష్మ ద్రోణుల మాటలు రుచింపక ధృతరాష్ట్రుడు సంజయుని పాండవుల సమాచారము నడిగెను. దానికి సమాధానముగ సంజయుడు యుద్ధమునకై ధృతరాష్ట్రుడు ఎవరెవరి సహాయమును పొందుచున్నాడో వివరించెను. భీమార్జునుల పరాక్రమమును గూర్చి ఆలోచిస్తూ ధృతరాష్ట్రుడు భయకంపితుడై పాండవులతో సంధిచేసుకొనుటను ప్రస్తావించెను. ధృతరాష్ట్రుని దోషములను వ్యక్తంచేస్తూ సంజయుడు పాపియగు దుర్యోధనుని అనుచరులతో కూడా అధీనంలో ఉంచుకోమని సూచించెను. భీష్మద్రోణాదుల పరాక్రమమును వర్ణించి దుర్యోధనుడు తన తండ్రితో తాత! పాండవుల వద్ద కేవలము ఏడు అక్షౌహిణుల సైన్యము మాత్రమే ఉన్నది. కనుక మనం ఓడిపోవుటకు అవకాశమే లేదు. కనుక మీరు దిగులు పడవద్దని ధైర్యము చెప్పి సంజయుని యుధిష్ఠిరుని యుద్ధసన్నాహములను గూర్చి అడుగగా సంజయుడు వివరించి చెప్పెను. ధృతరాష్ట్రుడు తన కొడుకుతో దుర్యోధనా! నీవు యుద్ధమునకై ఉత్సాహము చూపవద్దు. పాండవులకు వారికి రావలసిన రాజ్యము నీయవలసినది. సపరివారముగ ననుభవించుటకు నీకు సగం రాజ్యము చాలును. నిజానికి శకునియే నీ చేత ఈ పని చేయించుచున్నాడని చెప్పి సంధి చేసుకొమ్మని సూచించెను. కాని దుర్యోధనుడు తండ్రిమాటలను పెడచెవిని పెట్టి ఇట్లుపలికెను. తాతా! భీష్మ ద్రోణాదులపై భారముంచి నేను పాండవులను యుద్ధమునకై ఆహ్వానించుటలేదు. కర్ణుడు, నేను ఇద్దరము యుధిష్ఠిరుని బలిపశువును చేసి రణ యజ్ఞ దీక్షను గ్రహించితిమి. ఈ యజ్ఞంలో వేది రథము స్రుక్కు గద. మృగ చర్మము కవచము, రథమును మోయు నాల్గు గుఱ్ఱములు నాల్గు అగ్నులు, బాణములు కుశలు, యశస్సు హవిస్సు, నేను, కర్ణుడు,
మామ శకుని ముగ్గురమే శత్రుసంహారము చేయగలము. పాండవులతో

సహజీవనము అసంభవము. సూది మొనయంత భూభాగమును కూడా నేను పాండవులకీయ నని చెప్పి తండ్రిమాటలను తిరస్కరించెను. దుర్యోధనుని మాటలను విని ధృతరాష్ట్రుడు తన కొడుకును విడిచిపెట్టెదనని ప్రస్తావించి అక్కడున్న రాజులనందరిని సముదాయించి తిరిగి సంజయుని కృష్ణార్జునుల సందేశమును వినిపించమని కోరెను. శ్రీ కృష్ణుడు వర్ణించిన అర్జునుని పరాక్రమమును సంజయుడు వినిపించెను. పిమ్మట ధృతరాష్ట్రుడు పాండవులను మిక్కిలి బలశాలులుగా పేర్కొనగా కోపగించిన దుర్యోధనుడు తనను తాను పొగడుకొనెను. నేనొక్కడినే పాండుపుత్రుల నందరిని చంపగలనని కర్ణుడు గొప్పలు పలికెను. భీష్ముని తిరస్కార వచనములకు కర్ణుడు సభను విడిచి వెళ్ళిపోయెను. పక్షుల దృష్టాంతమునుచూపి కౌటుంబిక కలహము అనర్థదాయకమని చెప్పి విదురుడు పాండవులతో సంధి చేసుకోమని సలహాయిచ్చెను. మరల ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి హితవు చెప్పెను. దుర్యోధనుడు శ్రీకృష్ణఅర్జునుల సందేశమును నిరాదరించుటను చూచి రాజులందరు సభను విడిచి వెడలి పోయిరి. ఇంతలో వ్యాసమహర్షి అచ్చటకు వచ్చెను. వారి ఆదేశముతో సంజయుడు శ్రీ కృష్ణుని మహిమను వర్ణించి కౌరవ పాండవులమధ్య సంధి కుదుర్చుటకు శ్రీ కృష్ణుడు ఇచ్చటకు రానున్నాడని చెప్పెను. అది విని ధృతరాష్ట్రుడు ఎంతో సంతసించెను.

**6) భగవద్ యాన పర్వము:-**

ఈ ఉప పర్వమున 79 అధ్యాయములు గలవు. సంజయుడు వెళ్ళిన తరువాత యుధిష్ఠిరుడు శ్రీ కృష్ణుని వద్దకు వెళ్ళి వాసుదేవా! మీ నీడలో మేము ఎంతో సురక్షితంగా ఉన్నాము. కౌరవులను మనం యుద్ధానికి రెచ్చగొడుతున్నాము. ఈ ఉపద్రవం నుండి మీరే కాపాడాలి. నేను రాజ్యమంతటిని కోరలేదు. కేవలము అయిదు గ్రామములనే అడుగుచున్నాను. కాని దుర్బుద్ధియగు దుర్యోధనుడు వాటిని ఇచ్చుటకు గూడా ఇష్టపడుట లేదు. క్షత్రియ ధర్మమునను సరించి తప్పనిసరి అయినచో యుద్ధము చేయవలెని చెప్పి యథోచితవ్యవహారమునకు ఉపాయమునడిగెను. అంతట కృష్ణుడు ఇరుపక్షముల హితముకొఱకు సంధిచేయుటకై కౌరవుల వద్దకు వెళ్ళుటను ప్రస్తావించెను. యుధిష్ఠిరుని సందేహమును నివృత్తి చేస్తూ శ్రీ కృష్ణుడు ఒక వేళ కౌరవులు నాతో

అనుచితంగా ప్రవర్తించినట్లైతే వారిని మంటల్లో మసిచేయగలను. నేను అక్కడకు వెళ్ళుట వలన ఫలితముంటుందా? లేదా యనేది కాదు. నిందనుండి
తప్పించుకొనుటకు వారి వద్దకు వెళ్ళుట తప్పనిసరి యని పలికెను. ధర్మరాజు శ్రీ కృష్ణుని ప్రస్తావనను అంగీకరించెను.

శ్రీ కృష్ణ భగవానుడు యుధిష్ఠిరుని యుద్ధమునకు ప్రోత్సహిస్తూ ప్రస్తుత లక్షణములను బట్టి యుద్ధము తప్పనిసరియని తోచుచున్నదని పలికెను. భీమసేనుని శాంతి ప్రస్తావనను విని శ్రీ కృష్ణుడు అతనిని పరిహసించి యుద్ధమునకు ప్రేరేపించెను. అది విని భీముడు భయంతో నేను శాంతి ప్రస్తావన చేయలేదు. భరత వంశీయుల నాశనము కాకూడదనేది నా అభిమతమని చెప్పెను. పిమ్మట అర్జున నకుల సహదేవులు కూడా తమ తమ అభిప్రాయములను వ్యక్తము చేసిరి. ద్రౌపది శ్రీ కృష్ణుని వద్ద తన మనోవ్యథను వ్యక్తంచేసి సంధి ప్రస్తావనను నిందించెను. కన్నీళ్ళతో ఆమె ఇట్లుపలికెను. భీమసేన అర్జునులు నిస్పృహతో కౌరవులతో సంధి కోరుకొనిన నా ముసలి తండ్రి తన కొడుకులతో కలిసి కౌరవులతో యుద్ధము చేయగలడు. భుజములు తెగిపడగా దుశ్శాసనుడు నేల మీద దొర్లు వరకు నాకు మనశ్శాంతి లభించదు. శ్రీ కృష్ణుడు ఆమెను ఓదార్చెను. కౌరవపాండవులకు మంచి చేయుటకై శ్రీ కృష్ణుడు కార్తిక మాసము రేవతీ నక్షత్రము మైత్రముహూర్తమున హస్తినాపురమునకు బయలుదేరెను. మార్గమధ్యమున వృకస్థలమున రాత్రికి విశ్రమించెను.

శ్రీ కృష్ణుని రాకను తెలుసుకొని మిక్కిలి సంతోషించిన ధృతరాష్ట్రుడు శ్రీ కృష్ణుని స్వాగత సత్కారములకు తగు ఏర్పాట్లు గావించమని మార్గమున సేద తీర్చుకొనుటకు విశ్రాంతి భవనములను నిర్మించమని దుర్యోధనుని ఆదేశించెను. అతడు యథోచితవ్యవస్థ గావించెను. కాని శ్రీ కృష్ణుడు వానిని లక్ష్యపెట్టక హస్తినకు బయలుదేరెను. శ్రీ కృష్ణునికి రకరకాల కానుకలను ఇచ్చుటకు ధృతరాష్ట్రుడు ఏర్పాటు చేసెను. విదురుడు ధృతరాష్ట్రునితో రాజా! శ్రీ కృష్ణుడు అర్ఘ్యపాద్యములు మినహా మరియేమి తీసుకొనడు. కౌరవుల పాండవుల మధ్య శాంతి స్థాపనయే వారి అభిమతము. కనుక వారి మాటను గౌరవింపుడని పలికెను. శ్రీ కృష్ణునికి అమూల్యములగు కానుకలను ఇచ్చుటను విరోధిస్తూ

దుర్యోధనుడు ధృతరాష్ట్రునితో జనకా! శ్రీ కృష్ణుడు ఇచ్చటకు రాగానే అతనిని బంధించగలను. అతడు బంధింపబడిన సమస్త రాజులు నావశమగుదురని చెప్పెను. పుత్రుని దుష్టవ్యవహారమునకు చింతాక్రాంతుడైన రాజు ఇటువంటి నీచపు మాటలను పలుక వద్దని ఉపదేశించెను. దుర్యోధనుని దురాలోచనకు కోపగించిన భీష్ముడు సభా భవనము విడిచి వెళ్ళిపోయెను.

మరుసటి రోజు శ్రీ కృష్ణభగవానుడు వృకస్థలము నుండి హస్తినాపురము చేరెను.

రాజ భవనము ప్రవేశించగానే ధృతరాష్ట్ర, ద్రోణాచార్య, భీష్మలు తమ తమ ఆసనముల నుండి లేచి నిలబడి శ్రీ కృష్ణునికి స్వాగతము పలికిరి. అచ్చటినుండి విదురుని యింటికి వెళ్ళి పిమ్మట కుంతివద్దకు వెళ్ళి ఆమెను ఓదార్చెను. తరువాత శ్రీ కృష్ణుడు దుర్యోధనుని భవనమునకు వెళ్ళెను. ఆ సమయమున అచ్చట దుశ్శాసన, కర్ణ, శకునులు కూడా ఉండిరి. అతిథి మర్యాదలైన తరువాత దుర్యోధనుడు శ్రీ కృష్ణుని భోజనమునకు ఆహ్వానించెను. కాని శ్రీ కృష్ణుడు సున్నితముగ తిరస్కరించెను. కారణమడుగగా శ్రీ కృష్ణుడు దుర్యోధనునితో కార్యసిద్ధి అయిన పిమ్మటనే భోజనము లేక సమ్మానమును గ్రహించుట నియమము. కనుక వచ్చిన పని నెరవేరిన తరువాతనే నన్ను నీవు సత్కరించగలవు. సద్గుణ సంపన్నులగు నీసోదరులు పాండవులతో అకారణముగ విరోధించుట తగదు. పాండవులకు విరోధులు నాకును విరోధులే వారికనుకూలురు నాకును అనుకూలురే. నీ దుర్బుద్ధితో దూషితమగు ఈ యన్నము నేను తినుటకు యోగ్యము కాదు. అని చెప్పి శ్రీ కృష్ణుడు విదురుని యింటికి వెళ్ళెను. భోజనముగావించి రాత్రికి అచ్చటనే విశ్రమించెను. ఆసమయమున విదురుడు శ్రీ కృష్ణునితో మహాత్మా! మీరు ఇచ్చటకు వచ్చుట మంచిది కాదని నా అభిప్రాయము. కర్ణుడొక్కడే పాండవులను జయించగలడని దుర్యోధనుని విశ్వాసము. కనుక అతడు సంధిప్రస్తావనను అంగీకరించడని పలికెను. విదురుని మాటలు విని శ్రీ కృష్ణుడు తన సంధి ప్రస్తావము యొక్క ఔచిత్యమును వివరించెను.

మరుసటి రోజు ఉదయము శకుని దుర్యోధనులు శ్రీ కృష్ణుని వద్దకు వచ్చి రాజసభకు ఆహ్వానించిరి. శ్రీ కృష్ణుడు సభ లోనికి ప్రవేశించగానే

ధృతరాష్ట్రుని ముందుంచుకొని భీష్మ ద్రోణాదులు ఎదురేగిరి. భగవంతుని చూచుటకు నారదాది మహర్షులు అచ్చటకు వచ్చిరి. ఋషులు ఆసనముల నలంకరించిన పిమ్మట శ్రీ కృష్ణాదులు కూర్చుండిరి. పిమ్మట శ్రీ కృష్ణుడు ధృతరాష్ట్రుని వైపు చూచి భారత! క్షత్రియ వీరుల నాశనము జరుగకూడదను ఉద్దేశ్యంతో సంధి ప్రయత్నమునకై నేను వచ్చితిని. కురు వంశము చాలా శ్రేష్ఠమైనది. ఈ వంశములో ఎవరైనా అనుచితముగ వ్యవహరించు చున్నచో వారిని మీరే సన్మార్గమున పెట్టగలరు. ధర్మ, అర్థములను ప్రక్కకు బెట్టి మీ కొడుకులు క్రూరులవలె వ్యవహరించుచున్నారు. ఇరు పక్షముల మధ్య సంధి చేయుట మన యిద్దరి అధీనములో నున్నది. మీరు మీకొడుకులను వశంలో ఉంచుకొన్నచో నేను పాండవులను నియంత్రించగలను. దీనివలన ఇరుపక్షాలకు మేలు కల్గును. కుంతీ పుత్రులు మీకు సేవ చేయుటకు సిద్ధంగా నున్నారు. అవసరమైనచో యుద్ధానికి కూడా సిద్ధమే. మీకు నచ్చిన దాని నెంచుకొనుడని ఉపదేశించెను. శ్రీ కృష్ణుని మాటలు విని సభాసదులందరు ఆశ్చర్యపోయిరి. వారి నోట మాట రాలేదు. ధృతరాష్ట్రుని సంధి చేసుకొమ్మని ఉపదేశించిరి. నారదాది మహర్షులు అనేక ఉపాఖ్యానములను వినిపించి సంధి చేసుకొమ్మని దుర్యోధనునకు హితవు పలికితిరి.

ధృతరాష్ట్రుని కోరికపై శ్రీ కృష్ణుడు తిరిగి దుర్యోధనుని సముదాయిస్తూ దుర్యోధనా! పాండవులతో సంధి చేసుకొని కలకాలం సుఖసంతోషాలతో నుండుమని పలికెను. శ్రీ కృష్ణుని అప్రియ వచనములను విని దుర్యోధనుడు కేశవా! నీవు పాండవ పక్షపాతివి. కనుకనే నన్ను నిందించుచున్నారు. ధృతరాష్ట్రునితో సహా మీరందరు నన్ను ద్వేషించుచున్నారు. కాని అటువంటి అపరాధమును నేనేమీ చేయలేదు. సూది మోపినంత భూమిని కూడా నేను పాండవులకీయను. ఇదే నా నిర్ణయమని పలికెను. దుర్యోధనుని మాటలు విని కోపగించిన శ్రీ కృష్ణుడు వారి అకృత్యములను ప్రస్తావించి దుష్టచతుష్టయమును బందీలుగా చేసి పాండవులకప్పగించమని సలహాయిచ్చెను. ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిచి దుర్యోధనుని ఒప్పించవలసినదిగా కోరెను. గాంధారికూడా పాండవులతో సంధి చేసుకొమ్మని పుత్రునికి హితోపదేశము గావించెను. కాని దుర్యోధనుడు తల్లిమాటలను వినలేదు.

దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకునులు పరస్పరము చర్చించుకొని శ్రీ కృష్ణుని బందీ చేయుటకు నిర్ణయించిరి. ఇతరుల మనస్సులలోని అభిప్రాయములను తెలుసుకోగల సమర్థుడైన సాత్యకి దుష్ట చతుష్టయము దురభిప్రాయమును గ్రహించి సభాభవనము ద్వారము వద్ద సేనను సన్నద్ధము చేసి ఈ విషయమును శ్రీ కృష్ణునికి తెలియజేసెను. వారి కుతంత్రమును సాత్యకి ధృతరాష్ట్ర విదురులకు కూడా తెలియజెప్పెను. ధృతరాష్ట్రుని ఆదేశముననుసరించి విదురుడు సోదరులతో సహా దుర్యోధనుని సభకు తీసుకు వచ్చెను. ధృతరాష్ట్ర విదురులు శ్రీ కృష్ణుని మహిమను వర్ణించి దుర్యోధనుని సన్మార్గమున తీసుకు వచ్చుటకు ప్రయత్నము జేసిరి. పిమ్మట శ్రీ కృష్ణుడు తనను బందీగా చేయుట దుష్ట చతుష్టయముల అజ్ఞానమని పేర్కొని విశ్వరూపమును చూపెను. ధృతరాష్ట్రుని కోరిక ప్రకారము విశ్వరూపదర్శనము కొఱకు అతనికి దివ్యనేత్రములను ప్రసాదించెను. ఇది తెలుసుకొని ఋషిగణము శ్రీ కృష్ణుని స్తుతించిరి. పిమ్మట శ్రీ కృష్ణుడు కుంతిని కలియుటకు ఆమె వద్దకు వెళ్ళెను.

కుంతి ఇంటికి వెళ్ళి శ్రీ కృష్ణుడు కౌరవసభలో జరిగిన వృత్తాంతమంతయు చెప్పెను. పాండవులకు కుంతి ఇంటికి వెళ్ళి శ్రీ కృష్ణుడు కౌరవసభలో జరిగిన
వృత్తాంతమంతయు చెప్పెను. పాండవులకు కుంతి సందేశమును తీసుకుని ఆమెవద్ద సెలవు తీసుకొనిబయలుదేరెను. పిమ్మట భీష్మాదులనుండి అనుమతినొంది శ్రీకృష్ణుడు కర్ణుని రథముపైనెక్కించుకొని సాత్యకితో కూడా ఉపప్లవ్యనగరమునకు బయలుదేరెను. మార్గమున శ్రీకృష్ణుడు కర్ణునికి ఉపదేశిస్తూ కర్ణా! ఈ రోజునుండి నీవు పాండవులతో సోదర ప్రేమతో వ్యవహరింపుము. నీకు మంచి జరుగునని పలికెను. కాని కర్ణుడు దుర్యోధనుని పక్షముననే ఉండెదనని తన నిర్ణయమును ప్రకటించెను. పిమ్మట కర్ణుడు కృష్ణ! ఈ మహాయుద్ధమున గెలిచిన మీ దర్శనము చేసుకోగలను. లేనిచో స్వర్గమున కలిసెదమని చెప్పి శ్రీకృష్ణుని ఆలింగనము చేసుకొని వారి వద్ద సెలవు తీసుకొని రథముపై హస్తినకు మరలెను. శ్రీకృష్ణుడు సాత్యకితో ఉపప్లవ్యనగరముచేరెను.

విదురుడు కుంతివద్దకు వచ్చి కౌరవపాండవులమధ్య భవిష్యత్తులో జరగబోవు దుష్పరిణామమును తెలియజెప్పెను. వ్యథచెందిన కుంతి

కర్ణునివద్దకు వెళ్లి నీవు నా పెద్దకొడుకని చెప్పి పాండవులతో స్నేహభావముతో మెలగమని కోరెను. కాని కర్ణుడు ఆమె మాటలకు అంగీకరింపక నేను నీపుత్రులతో తప్పక యుద్ధము చేసెదను. అర్జునుడు మినహా మిగిలిన నల్గురిని చంపకుండా విడిచి పెట్టెదను. యుద్ధము తరువాత కూడా నీ అయిదుగురు పుత్రులు మిగిలియుందురు. కర్ణ అర్జునులలో ఎవరో ఒకరు నీకు మిగిలెదరని చెప్పి అచ్చటి నుండి వెడలెను. శ్రీకృష్ణుడు ఉపప్లవ్యనగరమునకు వెళ్లి పాండవులకు కౌరవసభలో జరిగిన వృత్తాంతమును చెప్పి వారిని యుద్ధమునకై ప్రేరేపించెను.

**7. సైన్యనిర్యాణపర్వము:-**

ఈ ఉపపర్వములో తొమ్మిది అధ్యాయములు గలవు. దుర్యోధనుడు తమకు రావలసిన రాజ్యమును ఇచ్చుటకు సిద్ధముగా లేడు కనుక యుద్ధము తప్పనిసరియని యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని వలన తెలుసుకొనెను. అతడు శ్రీకృష్ణుని సమక్షంలో తన సోదరులతో శ్రీకృష్ణుని రాయబారమును గూర్చి మీరునూ వింటిరి గదా. మన వద్ద ఏడు అక్షౌహిణుల సేన ఉన్నది. ద్రుపదుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, చేకితానుడు, భీమసేనుడు వీరందరూ ఏడు అక్షౌహిణులకు సేనానాయకులు కాగలరు. ప్రధానసేనాపతి ఎవరన్నది విచారణ చేయవలయును. కనుక మీరే సలహాచెప్పండని కోరెను. సహదేవుడు విరాటుని, నకులుడు ద్రుపదుని, అర్జునుడు ధృష్టద్యుమ్నుని, భీముడు శిఖండిని సూచించిరి. యుధిష్ఠిరుడు అడుగగా శ్రీకృష్ణుడు ధృష్టద్యుమ్నుడు
ప్రధాన సేనాపతి పదవికి తగినవాడుగా చెప్పెను. వారి మాటలకు పాండవులందరు సంతోషించిరి. సైనికులందరు ఉత్సాహంతో యుద్ధమునకు సన్నద్ధులైరి. అన్ని వైపుల శంఖ, దుందుభి ధ్వనులు మ్రోగుచున్నవి. యుధిష్ఠిరుడు సైనికుల మధ్యలో నడిచెను. వారితో అవసరమైనచో చికిత్సకై వైద్యులు నడిచిరి. ద్రౌపది కూడా మహారాజుతో కొంచెం దూరము వెళ్లి తిరిగి స్త్రీపరివారంతో ఉపప్లవ్యనగరమునకు మరలివచ్చెను. సైన్యము వ్యూహరచన చేసి పాండవులు కురుక్షేత్రమునకు వెడలిరి. అచ్చట హిరణ్వతి అను పవిత్రనది గలదు. అక్కడకుచేరిన

పిమ్మట వారి వాసస్థానమునకు చుట్టూ కందకము త్రవ్వించి భటులను కాపలా ఉంచెను. రాజులు నివసించుటకు వేరువేరుగా వేలకొలది శిబిరములను నిర్మించిరి. సమస్త ఉపకరణములతో వైద్యులు కూడా అచ్చటనుండిరి. దుర్యోధనుడు కూడా శిబిరనిర్మాణమునకు ఆదేశించెను. రేపే యుద్ధయాత్రకు బయలుదేరవలె నని చాటింపు వేయవలెనని దుర్యోధనుడు రాజులతో చెప్పెను. యుధిష్ఠిరుడు అడుగగా శ్రీకృష్ణుడు దురాత్ములగు కౌరవులు మీతో న్యాయోచితముగ వ్యవహరించుట లేదు. సర్వస్వము పోగొట్టుకొని మనం కౌరవులతో సంధి చేసుకొనజాలము. కనుక యుద్ధము తప్పని సరియని చెప్పెను. యుధిష్ఠిరుడు రాజులనందరిని యుద్ధమునకు సిద్ధము అవమని ఆదేశించెను. రాజు దుర్యోధనుడు తన పదకొండు అక్షౌహిణుల సేనలను ఉత్తమ, మధ్యమ, అధమముగా విభజించి వారిని యథోచిత స్థానములయందుంచెను. కురుక్షేత్రమున మొత్తం పద్దెనిమిది అక్షౌహిణులసేన ప్రోగుపడెను. కృపాచార్య, ద్రోణాచార్య, అశ్వత్థామ, శల్య, జయద్రథ, సుదక్షిణ, కర్ణ, భూరిశ్రవస, శకుని, బాహ్లీకులు పదకొండుమంది కౌరవసేనకు సేనాపతులు. భీష్ముడు ప్రధానసేనానాయకుడుగా నియోగింపబడెను. బలరాముడు పాండవులను కలిసి వారినుండి సెలవు తీసుకొని సరస్వతీనది తటవర్తి తీర్థములను సేవించుటకు వెడలెను. వారుకురువంశమునాశము చూచుటకు ఇష్టపడుటలేదు. ధృతరాష్ట్రుడు సంజయుని కౌరవపాండవులసేనావ్యూహమునుగూర్చి అడిగెను.

**8. ఉలూకదూతాగమనపర్వము:-**

ఇందు అయిదు అధ్యాయములు గలవు. దుర్యోధనుడు కర్ణదుశ్శాసనశకునులతో రహస్యముగా మంతనములు చేసి శకుని పుత్రుడగు ఉలూకుని దూతగా పాండవులవద్దకు పంపవలెనని నిశ్చయించెను. అతడు ఉలూకుని పిలిపించి శ్రీకృష్ణుని సమక్షమునే తమ సందేశమును పాండవులకు వినిపించమని చెప్పెను. "యుధిష్ఠిర! లోకభయంకరమగు
కౌరవపాండవయుద్ధము ఆసన్నమైనది. మీరుచేసిన ప్రతిజ్ఞలను నెరవేర్చుకొనుడు. ధర్మాత్ముడవై ఎట్లు అధర్మమందు ప్రవర్తించుచున్నావు. నీవు కేవలము అయిదు గ్రామములనే అడిగితివి. కాని నేను

బుద్ధిపూర్వకంగానే తిరస్కరించితిని. పాండవులను ఏదోవిధంగా రెచ్చగొట్టివారిని యుద్ధమునకు ఉసిగొలుపుటయే నాలక్ష్యము. శ్రీకృష్ణునితో వచ్చి యుద్ధంచేయండి" అనునది సందేశసారము. పిమ్మట ఉలూకుడు పాండవ శిబిరముచేరి కౌరవసందేశమును యుధిష్ఠిరునకు వినిపించెను. దానికి సమాధానంగా పాండవులు దుర్యోధనునకు సందేశము పంపిరి. శ్రీకృష్ణుడు కూడా తనవైపున దుర్యోధన! రేపే నీవు రణభూమికి వచ్చి నీపౌరుషమును చూపించుమని సందేశము పంపెను. ఉలూకునివలన శ్రీకృష్ణపాండవుల సందేశములు విన్న దుర్యోధనుడు రేపు సూర్యోదయమునకు పూర్వమే యుద్ధమునకు సిద్ధముగా నుండమని తమ సైన్యమును ఆదేశించెను. యుధిష్ఠిరుడు ధృష్టద్యుమ్నుని నేతృత్వంలో తన సైన్యమును యుద్ధమునకు సిద్ధము చేసెను.

**9. రథాతిరథసంఖ్యానపర్వము:-**

ఈ ఉపపర్వమున ఎనిమిది అధ్యాయములు గలవు. సేనాపతిపదవిని పొంది భీష్ముడు దుర్యోధనునితో రాజా! దేవగంధర్వమనుష్యుల వ్యూహరచన నాకు బాగా తెలుసు. దాని ద్వారా నేను పాండవులను మోహపెట్టగలను. నీసేనను రక్షిస్తూ నేను పాండవులతో యుద్ధము చేయగలను. కనుక నీవు చింతపడవలదని చెప్పెను. దుర్యోధనుడు తన పక్షమునకు సంబంధించిన రథులు, అతిరథులను గూర్చి భీష్ముని అడిగెను. భీష్ముడు కౌరవపక్షంవారిని వర్ణించి పాండవపక్షం వారిని గూడా పరిచయం చేసెను. శిఖండి మొదటగా కన్యగా ఉంటూ మరల పురుషునిగా మారెను. కనుక నేను అతనితో యుద్ధముచేయను. యుద్ధములో దొరికిన రాజులందరిని చంపెదను. కాని కుంతీపుత్రులను మాత్రము చంపనని చెప్పెను.

**10. అంబోపాఖ్యానపర్వము:-**

ఈ ఉపపర్వమున ఇరువదినాలుగు అధ్యాయములుగలవు. దుర్యోధనుడు భీష్ముని శిఖండి చంపకుండా విడిచిపెట్టెదననుటకు కారణమడుగగా భీష్ముడు అంబోపాఖ్యానమును వినిపించెను. తండ్రిశంతనుని మరణాంతరము తన ప్రతిజ్ఞననుసరించి భీష్ముడు తనసోదరుడగు చిత్రాంగదుని రాజ్యాభిషిక్తుని గావించెను.

అతడు మరణించినపిమ్మట విచిత్రవీర్యుని రాజుగాచేసెను. భీష్ముడు యోగ్యురాలగు కన్యను తీసుకువచ్చి విచిత్రవీర్యుని వివాహము జరిపించవలెనని నిశ్చయించి రాజులనందరిని జయించి స్వయంవరసభనుండి కాశీరాజుపుత్రికలైన అంబ, అంబిక, అంబాలికలను తీసుకువచ్చి సోదరునితో వారి వివాహముజరిపించుటకు తల్లికి అప్పగించెను. మొదటనుండి శాల్వరాజును కోరుకుంటున్న అంబ భీష్ముని అనుమతితో అతనివద్దకు వెడలెను. కాని అతడు ఆమెను తిరస్కరించుటచే దీనికంతటికి కారణము భీష్ముడని తలచి అతనిపై పగతీర్చుకొనుటకై తాపసుల ఆశ్రమముచేరి ఆరాత్రికి అక్కడనేఉండెను. అచ్చట శైఖావత్యుడను తపోవృద్ధుడు అంబను ఓదార్చెను. తన మాతామహుడగు హోత్రవాహనుని సూచననుసరించి అంబ పరశురాముని శరణువేడెను. పరశురామ భీష్ముల మధ్య ఘోర యుద్ధము జరిగెను. చివరకు భీష్ముడు ప్రస్వాపనాస్త్రమును ప్రయోగించెను. నారదుని మధ్యవర్తిత్వంచే ఇరువురు యుద్ధమునుండి తొలగిరి. రాజకన్య అంబ ఘోరతపస్సు చేసెను. శివుడు ప్రత్యక్షముకాగా ఆమె పరమేశ్వరుని భీష్మునిచంపుటకు వరమునడిగెను. పరమేశ్వరుడు కళ్యాణీ! నీకోర్కె తప్పక నెరవేరగలదు. నీవు మొదట కన్యగాపుట్టి కొంతకాలము తరువాత పురుషరూపమును పొందెదవని అనుగ్రహించెను. అంబ యమునానది ఒడ్డున చితిలో మండి భస్మమాయెను. అనపత్యుడగు ద్రుపదమహారాజు తపస్సునాచరించి మహాదేవుని పుత్రప్రాప్తికై వరమడిగెను. పరమేశ్వరుడు రాజా! కన్యగా పుట్టి ఆమెయే పురుషరూపమును పొందగలదని వరమిచ్చెను. ద్రుపదమహారాణికి కన్య జన్మించెను. నాకు కొడుకు పుట్టెనని రాజు ప్రకటించెను. శిఖండియను పేరు పెట్టెను. ద్రుపదుని తప్ప బయటివారెవ్వరికి కన్యయను సంగతి తెలియదు. భీష్మునికి మాత్రము నారదునివలన శిఖండి వృత్తాంతము తెలియును. యుక్తవయస్సురాగానే దశార్ణరాజు పుత్రితో శిఖండి వివాహము జరిగెను. శిఖండి ఆడపిల్లయని తెలుసుకొని మామగారైన దశార్ణరాజు హిరణ్యవర్మ క్రుద్ధుడాయెను. శిఖండిని వనమునకేగి స్థూణాకర్ణుడను యక్షునితో తన బాధను విన్నవించుకొనెను. యక్షుడు కొంతకాలమునకు తన పురుషరూపమునిచ్చి స్త్రీత్వమును గ్రహించెను. విషయము తెలుసుకొని కోపగించిన కుబేరుడు ఈరోజునుండి నీవు స్త్రీగా నుందువు. శిఖండిని శిఖండిగా

పురుషరూపముననుండునని శపించెను. మొదట స్త్రీయగుటచే భీష్ముడు శిఖండిని చంపనని నిశ్చయించెను. కౌరవపాండవసేనలు యుద్ధమునకు బయలుదేరినవి.

**ఇది ఉద్యోగపర్వ కథాంశము.**